క్లుప్తంగా

సీజేపై దాడికి ఖండన

నరసరావుపేట ఈస్ట్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువాది సుబ్బారావు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేసు విచారణ సమయంలో ఇటువంటి ఘటన జరగటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని అన్నారు. తనపై దాడి జరిగినప్పటికీ జస్టిస్ గవాయ్ ప్రశాంతంగా తన స్థానంలో ఉండటం దేశ న్యాయ వ్యవస్థ బలం, గౌరవాన్ని సూచిస్తున్నదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. సీజేపై జరిగిన దాడి దీనికి నిదర్శనంగా అభివర్ణించారు. సమావేశంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు పరిశీలన



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను నీతి ఆయోగ్ బృందం మంగళవారం సందర్శించింది. కొత్తపల్లి గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి లబ్ధి పొందుతున్న వారి గృహాలను సందర్శించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న రేషన్, గుడ్లు, బాలామృతం, పౌష్టికాహారం, అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమావేశాలపై కూడా ఆరా తీశారు. 0–6 సంవత్సరాల వయస్సు గల పిల్లల పెరుగుదలలో అంగన్‌వాడీల పర్యవేక్షణను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఎత్తు, బరువులను రికార్డులతో సరి చూశారు. నీతి ఆయోగ్ బృందం సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో నీతి ఆయోగ్ బృందం కమిటీ సభ్యులతో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

రాజుపాలెం: ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు అందించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హర్షికప్రియదర్శిని మంగళవారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వారంలో ఆక్రమణదారులు ఖాళీ చేయాలని, లేనిపక్షంలో దగ్గరుండి ఖాళీ చేయిస్తామని హెచ్చరించారు.

బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేస్తే కఠిన చర్యలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయవద్దని, అలా చేసిన రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.నగేష్ హెచ్చరించారు. మండలంలోని చాగంటివారిపాలెంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నగేష్ మాట్లాడుతూ 2025–26 నుంచి రాష్ట్రంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగును నూరుశాతం నిషేధం చేయడానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీ.ఓ విడుదల చేసిందన్నారు. బ్లాక్‌బర్లీ పొగాకు నారు సాగును, నర్సరీలను నిషేధించటమైందన్నారు. ఒక వేళ సాగు చేసినా పంటను దున్ని తీసేయడం జరుగుతుందన్నారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆయా సంస్థల నుంచి అగ్రిమెంట్స్ బాండ్లను పొందాల్సి ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము లేదా చిరుధాన్యాల సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.శేషుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.పావని, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి ఆధ్వర్యాన ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, బాలల హక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. డీసీపీఓ యూనిట్ సోషల్ వర్కర్లు జి.జయరాజ్, ఎస్.నానమ్మ.. బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు.. పొంగుతున్న వాగులు



రాముడుపాలెం వద్ద రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వాగు

నూజెండ్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులకు గండ్లు పడి రవాణాకు ఆటంకం ఏర్పడింది. మండల పరిధిలోని ఐనవోలు గ్రామం నుంచి పెద్దవరం వెళ్లే రహదారిపై నిర్మించిన కల్వర్టు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి కావటం తారురోడ్డు సైతం కొట్టుకుపోవటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. యోగిరెడ్డిపాలెం రహదారికి గండ్లు పడటంతో రవాణా సౌకర్యం నిలిచిపోయింది. అండర్‌పాస్ రైల్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వినుకొండ నుంచి నూజెండ్ల మీదుగా దర్శికి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి రాముడుపాలెం వద్ద ఉన్న లో లెవల్ బ్రిడ్జి వద్ద చిలకలేరు వాగు పొంగి పొర్లుతుంది. నీటి ఉధృతి తగ్గే వరకూ వాహనాలు రెండు వైపులా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరమే రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కూలిన కల్వర్టు.. రాకపోకలకు ఇబ్బందులు



పెద్దవరం వద్ద కూలిన కల్వర్టు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలోని ఉత్తర దిక్కు గ్రామాలైన చాకలికుంట తండా, ఎడ్వర్డ్‌పేట, కొత్తపల్లి, రెడ్డిపాలెం, మాచవరం, విప్పర్ల, బెహరావారిపాలెం గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు నకరికల్లు మండలంలోని అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో 6.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అయితే మంగళవారం వాతావరణం పొడిగా ఉండటంతో రైతులు వ్యవసాయ పనులు యథావిధిగా నిర్వహించుకున్నారు.

వర్షం నీటిలో చెత్త సంపద కేంద్రం



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో గత రాత్రి కురిసిన వర్షానికి కొంకెరు వాగు వంతెన సమీపాన ఉన్న చెత్త సంపద కేంద్రం పూర్తి స్థాయిలో వర్షపు నీటిలో మునిగినినట్లు పంచాయతీ కార్యదర్శి చక్రవరపు శ్రీవల్లి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో ప్రభుత్వ భూమి లేకపోవటంతో వాగు పోరంబోగు స్థలంలో నిర్మించారని, వర్షం పడిన ప్రతిసారి చెత్త సంపద కేంద్రం మునిగిపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చెత్త సంపద కేంద్రంలో నిల్వ ఉంచిన వర్మీ కంపోస్టు ఎరువు రెండు క్వింటాళ్లు, ఎరువు దిబ్బ తదితర సామగ్రి అంతా నీటి పాలైందని అన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ ప్రజా వేదికలు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, పక్కన అధికారులు



ఖాళీగా ఉన్న కుర్చీలు

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం నిర్వహించారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 841 పనులను రూ.15.76 కోట్లతో 33 గ్రామ పంచాయతీల్లో చేశారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో కూలీలు, మెటీరియలుకు జరిగిన పనులు ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఉద్యాన పంటల సాగు, చెరువులు, కుంటలు పూడిక, పంట కాలువలు, పొలాల్లో నీటి కుంటలు తదితర పనులకు గాను గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేసి ప్రజావేదికలో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక డ్వామా పీడీ ఎం.సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రికవరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు జాబ్ కార్డులను తప్పనిసరిగా పరిశీలించి అప్డేట్ చేయాలన్నారు. పనులకు సంబంధించి ఫొటోలు, ఆధారాలు, సామాజిక తనిఖీ సిబ్బందికి తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలు, చనిపోయిన వారికి ఉపాధి హామీ పథకంలో చెల్లింపులు వంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి కె.హీరోలాల్ నాయక్, ఎస్టీఎం ఏ లోకేష్, ఎంపీపీ భక్తి రాములు, ఏపీడీఈ బూసిరెడ్డి, ఎంపీడీవో పి.మాధురి, ఎస్ఆర్‌పీ బి.ఆవులయ్య పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికకు కరువైన ప్రజాస్పందన

మండలంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు ప్రజాస్పందన కరువైంది. ప్రజావేదికలో ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉపాధి హామీ పథకం సాంకేతిక క్షేత్ర సహాయకులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, మినహా ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల నుంచి ప్రజలు అంతంత మాత్రమే హాజరయ్యారు.17వ విడత సామాజిక తనిఖీలపై జిల్లాస్థాయి అధికారుల్లో సైతం నిరుత్సాహం నెలకొంది. మండలంలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకంలో పనులు జరిగాయి. అంతే స్థాయిలో అవినీతి, అవకతవకలు చోటు చేసుకున్నాయి.

ఉండి.. ఉపయోగం లేదు



గోడకు వేలాడిన రైల్వే స్టేషను దారి బోర్డు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం రైల్వేస్టేషన్ కరోనాకు ముందు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు దూర ప్రాంతాలకు ప్రయాణ కేంద్రంగా ఉండేది. గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు మినహా 8 ప్యాసింజరు రైళ్ల ద్వారా వివిధ ప్రాంతాలకు రైలు మార్గం ద్వారా వెళ్లేవారు. అంతేకాకుండా కరోనా తర్వాత రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్పు చేయటంతో శావల్యాపురం రైల్వే స్టేషను పేరుకు మాత్రమే జంక్షన్‌గా ఉండి నిరుపయోగంగా మారింది. శావల్యాపురం రైల్వే స్టేషనుకు దారి చూపించే బోర్డు సింబల్‌తో స్థానిక ఆర్యవైశ్య వీధి పక్కనే చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బోర్డు ఎండకు ఎండి వానకు తడిచి బోర్డు ఒక పక్కకు వాలిపోయింది. రైల్వే అధికారులు నేటి వరకు పట్టించుకున్న దాఖలాలు లేదు. బోర్డు మాత్రం గోడకు తగిలించిన క్యాలెండరు మాదిరిగా తయారు కావటంతో కరోనా కాలంలో ప్యాసింజర్ రైళ్లు రద్దు కావటంతో ఈ బోర్డు సంగతి ప్రజలు కూడా మరిచిపోవటం విశేషం. పేరుకు మాత్రమే శావల్యాపురం రైల్వే స్టేషను రైల్వే కంప్యూటర్లలో మాత్రమే గొప్పగా రైల్వే జంక్షన్‌గా నమోదు కావటం మినహా ప్రజలకు నిరుపయోగంగా ఉందని మండల ప్రజలు రైల్వే అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పనుల పరిశీలన



చిరుమామిళ్ళ జెడ్పీ హైస్కూలులో పనులు పరిశీలిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న సింథటిక్ రన్నింగ్ ట్రాక్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ట్రాక్ నిర్మాణానికి ముందు జరగవలసిన సివిల్ పనులు పూర్తయ్యాయని, త్వరలో సింథటిక్ ట్రాక్ పనులు ప్రారంభిస్తామని విద్యాదాత, గోల్కొండ సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి తెలిపారు. రామిరెడ్డి అందించిన రూ.50 లక్షల ఆర్థిక సాయంతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని రన్నింగ్ ట్రాక్‌ను పరిశీలించి అదే తరహాలో ఇక్కడ నిర్మిస్తున్నారు. ట్రాక్ పూర్తయితే పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట హెచ్ఎం కిషోర్, ఉపాధ్యాయులు, స్థానికులు యన్నం శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడలతో విద్య, ఉద్యోగ అవకాశాలు



పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో సుభాని



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నరసరావుపేట రూరల్: క్రీడాకారులకు విద్యతో పాటు ఉద్యోగాల్లోను ప్రభుత్వాలు రిజర్వేషన్ కల్పిస్తున్నాయని డిప్యూటీ డీఈవో సుభాని తెలిపారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీలను మంగళవారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సుభాని, ఎంఈవో నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి డాక్టర్ ఉన్నం పద్మావతిలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని, వివిధ స్థాయిల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీలను తొలిరోజు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 20కు పైగా జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా అండర్–14, అండర్–17 మండల జట్లను ఎంపిక చేశారు. పోటీలను వ్యాయమ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, జి.ప్రసాద్, టి.వి.భాస్కర్, ఉమాదేవి, రమాదేవి, రషీదా, అశోక్‌లు పర్యవేక్షించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



నరసరావుపేట ఈస్ట్: పాలపాడు రోడ్డులోని శ్రీచిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, నాగవల్లీ దళాలతో అర్చనలు నిర్వహించి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

సత్తెనపల్లి: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. అప్పుడే క్లీన్ అండ్ గ్రీన్ యొక్క లక్ష్యాన్ని అందుకున్నట్లేనని చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని సుప్రీం ఎల్‌టీసీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలైన పరిశుభ్రత, పచ్చదనంపై మంగళవారం జిల్లాలోని 28 మండలాల నుంచి ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరిగే అన్ని కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని పిలుపునిచ్చారు. శిక్షణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం, హరిత రాయబారుల హక్కులు, అవకాశాలపై అవగాహన కల్పించారు. నరసరావుపేట డీఎల్పీవో లక్ష్మణరావు, డీఆర్పీ నరసింహ నాయక్‌లు మాట్లాడారు. అనంతరం నందిగామ సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలుకూరి కృష్ణప్రసాద్ వివరించారు. శిక్షణకు మాస్టర్ ఆఫ్ ట్రైనర్లుగా బాపట్ల ఈటీసీ ఫ్యాకల్టీ సభ్యుడు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు శివ కోటేశ్వరరావు, సదాశివ కుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లాలోని 28 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలలకు భారీ వితరణ



శారద హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో హాజరైన ప్రతినిధులు

- రూ.4 లక్షల బోధన పరికరాలు అందజేత
- మూడు జెడ్పీహెచ్‌ఎస్‌లలో రోబోటిక్ తరగతులు ప్రారంభం

చిలకలూరిపేట: విద్యార్థులలో నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంతో వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్.. రోటరీ, ఇన్నర్‌వీల్‌ల సహకారంతో పలు పాఠశాలలకు భారీగా సహాయాన్ని అందించారు. స్థానిక శారద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోధన పరికరాలు అందజేశారు. ఈ వితరణను తోటకూర రామకోటయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఇస్తున్నట్లు తెలిపారు. రూ.4 లక్షల విలువైన 50 బెంచీలు, 12 ఎస్ చైర్లు, 12 ర్యాక్‌లు, 4 గ్లాస్ బోర్డులు, 25 సైన్స్ చార్టులు, 20 ప్రముఖ శాస్త్రవేత్తల ఫొటోలను హైస్కూల్‌కు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని విద్యార్థులకు సూచించారు. వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, యూహెల్ప్(యూఎస్ఏ) సహకారంతో శారద జెడ్పీ హెచ్ఎస్ (చిలకలూరిపేట), పెదనందిపాడు, ఉన్నవ జెడ్పీ హైస్కూళ్లలో రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ను లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ప్రతి పాఠశాలకు రూ.2.75 లక్షల విలువైన రోబోటిక్ కిట్‌లను అందించినట్లు తెలిపారు. ఫౌండేషన్ తరఫున అందించిన రోబోటిక్స్ తరగతులు క్వాంటమ్ కంప్యూటింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్‌పై విద్యార్థులకు అవగాహన పెంచాలని ఆచార్య రామినేని శివరామప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకట నారాయణ, చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరు ప్రసాద్ పాఠశాల హెచ్ఎం కె.రత్నజ్యోతితో అవగాహన పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో దాత ఆళ్ళ వెంకట్ (యూఎస్ఏ), ఫౌండర్ తోటకూర శ్రావణ్‌శ్రీనివాస్, రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు మండల స్థాయి అధికారులు స్పందించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్ళేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగళ్ల వీరయ్య స్థానిక నాయకులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందించిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసరావు పనులు పూర్తి చేయాలంటూ స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో మంగళవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు రెండు పక్కల ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. రోడ్డు చదునుచేసి దోమలు ప్రబలకుండా మందు పిచికారీ చేశారు. పనులు పూర్తి చేయటంతో గ్రామస్తులు ఆలా శివకోటిరెడ్డి, నాతాని రామకృష్ణయ్య, చేకూరి అన్నపూర్ణమ్మ, రంగారావును అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రాజుపాలెం: సీజనల్ వ్యాధులపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్క ఆశ కార్యకర్త వారివారి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరగడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో బాలింతలను ఆశ, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి



బెల్లంకొండ జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ, సిబ్బంది

బెల్లంకొండ: జెడ్పీ పాఠశాలలో సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచిపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాలలో నీరు నిలిచిపోకుండా ఉండేందుకు, మైదానం అభివృద్ధికి, పాఠశాలలో మరమ్మతులకు జిల్లా పరిషత్ నుంచి రూ. 36 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. మైదానంలో నిలిచిపోయిన వర్షంనీటిని తూముల ద్వారా బయటకు పంపించారు. పాఠశాల ప్రహరీ చుట్టూ డ్రైనేజీలను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ వేణు నాయక్, ఎంపీడీవో సునీత, ఎంఈఓ బాలసుందరరావు, పీఆర్ డీఈ వాణినాథ్, ఏ శ్రీనివాసరెడ్డి, నేతలు పీఎస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం పాల్గొన్నారు.

మానసిక స్థైర్యంతో విజయకేతనం



నకరికల్లు: మానసిక స్థైర్యంతో సులువుగా విజయాలు సాధించవచ్చని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతివర్ధన్ అన్నారు. అంతర్జాతీయ మానసిక వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినిలకు మానసిక ఆరోగ్యం, యోగాసనాల ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు మానసిక స్థైర్యం కోల్పోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. మానసిక, శారీరక దృఢత్వం సాధించాలని సూచించారు. విద్యార్థినిలతో మానవహారం ఏర్పాటు చేశారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.